APTEL/26/A0542

# స్ఫూర్తి పత్రిక

Voice of Truth

విలేకరులు కావలెను
స్ఫూర్తి పత్రిక డైలీ పేపర్ నందు
కర్నూలు,నంద్యాల,అనంతపురం, శ్రీ సత్యసాయి,
వైయస్సార్ ,తిరుపతి, అన్నమయ్య ,చిత్తూరు ,జిల్లాలలో
పనిచేసేందుకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నియోజకవర్గ ఇన్చార్జీలు
మండల రిపోర్టర్స్ కావలెను.
స్ఫూర్తి పత్రిక Voice of Truth
గతంలో పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం వార్తలు చక్కగా రాయగలిగే నైపుణ్యం గల వారికి అవకాశం కలదు.
ఎటువంటి యాడ్స్ టార్గెట్లు లేదు. కొత్త వారికి అవకాశం కలదు.
ఆసక్తి గలవారు సంప్రదించండి : 8179446036,7794947413.

ప్రచురణ : కర్నూలు | సంపాదకుడు : నరసనాయుడు బోయ | సంపుటి : 01 సంచిక :64 | పేజీలు : 04 వెల రూ. 2/- | సోమవారం 04-05-2026

PUBLICATION : KURNOOL | EDITOR : NARASANAIDU BOYA | VOLUME : 01 ISSUE : 64 | PAGES : 04 PRICE : 2 | MONDAY, 04 MAY 2026

Kurnool Edition | Covering Andhra Pradesh & Telangana |

## దీదీకి షాకిచ్చిన బీజేపీ త్రయం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ దేశ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. మమతా బెనర్జీ కంచుకోటను బద్దలు కొడుతూ బీజేపీ అనూహ్య ఆధిక్యం దిశగా



దూసుకుపోతుండటం వెనుక ఒక అదృశ్య శక్తి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఆయనే బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సాల్. సంస్థాగత నైపుణ్యాలకు మారుపేరైన బన్సాల్.. భూపేంద్ర యాదవ్, బిప్లబ్ దేబ్ వంటి హేమాహేమీలతో కలిసి తన సైలెంట్ ఆపరేషన్‌తో టీఎంసీ అధినేత్రిని ఉక్కిరిబిక్కిరి చేసిన తీరు చర్చనీయాంశంగా మారింది.

2లో

## 44 జాతీయ పక్షులు మృతి.. కర్ణాటకలో హై అలర్ట్



2లో

కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో జాతీయ పక్షుల వరుస మరణాలు తీవ్ర కలకలం

'హెచ్5ఎన్1 బర్డ్ ఫ్లూ' మహమ్మారే కారణమని ల్యాబ్ రిపోర్టుల్లో నిర్ధారణ

ఏప్రిల్ 16న తొలిసారిగా వెలుగుచూసిన ఈ విషాదం

తుమకూరు: కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో జాతీయ పక్షుల వరుస మరణాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. పచ్చని పొలాల్లో కనువిందు చేయాల్సిన అందమైన నెమళ్లు, 'సైలెంట్ కిల్లర్' దాటికి విగతజీవులుగా మారుతున్నాయి.

## చల్లటి కబురు చెప్పిన ఐఎండీ

ఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో ఎండలు భగ్గుమంటున్నాయి.. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో



2లో

నమోదవుతున్నాయి. తెలంగాణలో సాధారణంగా మే రెండో వారం తర్వాత తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ ఈసారి ఏప్రిల్ రెండో వారం నుంచే ఉష్ణోగ్రతలు అత్యధికంగా రికార్డవుతున్నాయి. వడగాడ్పులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. ఈసారి ముందుగానే నైరుతి రుతుపవనాలు రానున్నాయి.

## జెన్ జీ లక్ష్యంగా టీఆర్ఎస్ ముందుకు వెళుతుంది.. కాంగ్రెస్‌ను గద్దె దించుతాం: కల్వకుంట్ల కవిత

ఇకపై తెలంగాణ జాగృతి ఎన్జీవోగా పని చేస్తుందన్న కవిత

తెలంగాణ ఉద్యమకారుల కోసం లక్ష సూపర్ న్యూమరికల్ ఉద్యోగాలను క్రియేట్ చేస్తామని హామీ

రేవంత్ ఇక్కడ ఉన్నా.. సిమ్ కార్డు ఢిల్లీలో ఉంటుందని ఎద్దేవా



2

హైదరాబాద్: తెలంగాణ జాగృతి సంస్థ ఇకపై ఎన్జీవోగా పనిచేస్తుందని, తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెన్ జీ యువతే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని ఆ పార్టీ అధ్యక్షురాలు

## విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష



2లో

★విద్యుత్ సరఫరాకు అవసరమైన సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు

★సోలార్ పవర్ పైన స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలి

★విద్యుత్ సబ్‌స్టేషన్ల పక్కనే సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు.

★పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టే 18 సోలార్ పవర్ ప్లాంట్లు నిర్మాణానికి నోడల్ అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు

హైదరాబాద్: రాష్ట్రంలో నూతన పారిశ్రామిక వాడలు, హైస్పీడ్ రైల్ కారిడార్లు, ట్రిపుల్ ఆర్ వంటి అభివృద్ధి ప్రాజెక్టులు రానున్న నేపథ్యంలో డిమాండ్‌కు తగిన విద్యుత్ సరఫరాకు అవసరమైన సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ఆదేశించారు. విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి గారు ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారితో కలిసి ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. ఈ సమావేశంలోఎంపీ వేం నరేందర్ రెడ్డి గారితో పాటు ఇంధన శాఖకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు. గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా ప్రాధాన్యక్రమంలో దరఖాస్తులు పెట్టుకున్న వారికి అనుమతులు ఇవ్వాలని అధికారులకు చెప్పారు. భారీ డేటా సెంటర్లకు అవసరమైన అనుమతులు మంజూరు

## ఛత్తీస్‌గఢ్‌లో మందుపాతర తొలగిస్తుండగా పేలుడు.. ముగ్గురు జవాన్ల మృతి

- ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో ఐఈడీ పేలుడు
- ఈ ఘటనలో ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు మృతి, మరొకరికి గాయాలు
- డీమైనింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఈ దుర్ఘటన
- మావోయిస్టులు గతంలో అమర్చిన బాంబుగా పోలీసుల అనుమానం
- రాష్ట్రాన్ని మావోయిస్టు రహితంగా ప్రకటించాక ఇదే మొదటి పేలుడు



2

## కిందస్థాయి సిబ్బందితో ఫ్రెండ్లీగా ఉండండి.. ఆర్టీసీ అధికారులతో పొన్నం ప్రభాకర్



2

## వరంగల్‌కు మహర్దశ..



2లో

### మే 10న కాకతీయ మెగా పార్క్‌ను ప్రారంభించనున్న ప్రధాని

- ఈ నెల 10న వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభం
- హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- రూ.6,000 కోట్లకు పైగా పెట్టుబడులు.. 24,400 మందికి ఉపాధి అంచనా
- 1,327 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటిగా నిర్మాణం

## 180కి పైగా సీట్లు గెలుస్తాం, విజయ్ ముఖ్యమంత్రి అవుతారు



2లో

ఎన్నికల అనంతరంపొత్తు వార్తలను కొట్టిపారేసిన టీవీకే పార్టీ

విజయ్ దూరదృష్టితో రాష్ట్రాన్ని పాలిస్తారని వ్యాఖ్య

## లోకేశ్ పై వెంకయ్యనాయుడు ప్రశంసలు



అమరావతి: ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పనితీరుపై భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంసల జల్లు కురిపించారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం గొలగమూడిలో ఈరోజు పర్యటించిన ఆయన, శ్రీ భగవాన్ వెంకయ్యస్వామి జీవిత చరిత్ర 'విశ్వంభరుడు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్య, కుటుంబం మరియు సామాజిక విలువలపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర విద్యాశాఖలో వస్తున్న మార్పులను వెంకయ్యనాయుడు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సాధించిన ఘనతను ఆయన కొనియాడారు. విద్యాశాఖ మంత్రిగా లోకేశ్ తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని, మంచి పనులు చేసే వారిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఇక, "నా కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపా వెంకట్‌ల వ్యాపారాల్లో నేను జోక్యం చేసుకోను. నా రాజకీయాల్లోకి వారు రావొద్దు అని మా మధ్య ఒక గౌరవ ఒప్పందం ఉంది" అని ఆయన తెలిపారు. నేటి కాలంలో తల్లిదండ్రులు పిల్లలకు సమయాన్ని కేటాయించడం లేదని, టీవీలు, మొబైళ్లకే పరిమితం అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలతో గడపడం ద్వారానే మంచి విలువలను అందించగలమని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలోని పరిస్థితులపై వెంకయ్యనాయుడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రోజూ పత్రికల్లో వస్తున్న కొన్ని వార్తలను చూస్తుంటే సిగ్గేస్తోందని, పాశ్చాత్య వ్యామోహంలో పడి మన సంస్కృతిని విస్మరిస్తున్నామని మండిపడ్డారు. సమాజం గతితప్పినప్పుడే యోగి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వంటి మహానుభావులు జన్మిస్తారని, ఆధ్యాత్మికత వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు.

- పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఘనతను ప్రశంసించిన వెంకయ్యనాయుడు
- లోకేశ్ తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని ప్రశంస
- తల్లిదండ్రులు పిల్లలకు సమయం కేటాయించడం లేదని ఆవేదన

## పుట్టపర్తి దశ మార్చనున్న డీఆర్‌డీవో.. రూ.15,000 కోట్లతో యుద్ధ విమానాల తయారీ కేంద్రం



2లో

★శ్రీసత్యసాయి జిల్లాలో రూ.15,000 కోట్లతో డీఆర్‌డీవో భారీ ప్రాజెక్ట్

★పుట్టపర్తిలో ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ కేంద్రం ఏర్పాటు

★ఈ నెల 15న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపనకు సన్నాహాలు

★రక్షణ, ఏరోస్పేస్ హబ్‌గా వేగంగా మారుతున్న శ్రీసత్యసాయి జిల్లా

★బెంగళూరుకు సమీపంగా ఉండటంతో జిల్లాకు పెరుగుతున్న ప్రాధాన్యత

అమరావతి: ఏపీలో ఏరోస్పేస్, రక్షణ రంగం పరుగులు పెట్టనుంది. రాష్ట్రానికి మరో భారీ ప్రాజెక్ట్ రాబోతోంది. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఏకంగా రూ.15,000 కోట్ల పెట్టుబడితో ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు

## ఈ అద్భుత ఘనకార్యానికి గుర్తుగా దేశంలోని మ్యూజియంలలో మోదీ పేరును సువర్ణాక్షరాలతో రాయించాలి: షర్మిల



2లో

★వాణిజ్య గ్యాస్ ధరల పెంపుపై ప్రధాని మోదీపై షర్మిల ఫైర్

★ఎన్నికల తర్వాత ప్రజలపై భారం మోపడం మోదీకి అలవాటు

★ఒకేసారి రూ. 993 పెంచి సామాన్యుల నడ్డి విరిచారని ఆరోపణ

# చల్లటి కబురు చెప్పిన ఐఎండీ

మొదటి పేజి తరువాయి

ఈసారి ముందుగానే నైరుతి రుతుపవనాలు రానున్నాయి. ఈ నెల 14 లేదా 15న అండమాన్ తాకొచ్చని ఐఎండీ అంచనా వేసింది. దేశవ్యాప్తంగా సాధారణం కంటే ఈసారి ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ పేర్కొంది. దక్షిణాది, పశ్చిమ భారతంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ఈశాన్య రాష్ట్రాల్లో తక్కువగా వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని ఐఎండీ వెల్లడించింది. పంజాబ్, హర్యానా, చండీగఢ్, రాజస్థాన్‌లో మే 7 వరకు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, 30-40 కిమీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. ఉత్తరప్రదేశ్‌లో మే 4 నుండి మే 7 మధ్య వర్షాలు, ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశముందని ఐఎండీ తెలిపింది. మే 3,4 జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో వడగండ్ల వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, నాగాలాండ్-మణిపూర్-మిజోరం-త్రిపుర ప్రాంతాల్లో మే 3 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తమిళనాడు, పుదుచ్చేరి, కేరళలో మే 4 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. తెలంగాణలో సాధారణంగా మే రెండో వారం తర్వాత తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ ఈసారి ఏప్రిల్ రెండో వారం నుంచే ఉష్ణోగ్రతలు అత్యధికంగా రికార్డవుతున్నాయి. సాధారణ ఉష్ణోగ్రతల కంటే 2 డిగ్రీల నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకు అధిక ఉష్ణోగ్రతలు వరుసగా నమోదు కావడాన్ని హీట్‌వేవ్ (వడగాడ్పులు)గా పరిగణిస్తారు.

ఈసారి ముందుగానే నైరుతి రుతుపవనాలు మే లోనే వర్షాలు..?

ఈ లెక్కన రాష్ట్రంలో ఏప్రిల్ 14 నుంచి వరుసగా చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే 2 డిగ్రీల నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యాయి. దీంతో ఏప్రిల్‌లోనే ఏకంగా 14 రోజులపాటు హీట్‌వేవ్ ప్రభావం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఇక మేలో తొలిరోజునే 42 డిగ్రీల నుంచి 45 డిగ్రీల మేర సగటు ఉష్ణోగ్రతలు నమోదవగా ఈ నెలలో ఇంతకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. వడగాడ్పుల రోజులు సైతం అత్యధికంగా ఉండే అవకాశం ఉందని అంటున్నారు.

### జెన్ జీ లక్ష్యంగా టీఆర్ఎస్ ముందుకు వెళుతుంది..

## కాంగ్రెస్‌ను గద్దె దించుతాం: కల్వకుంట్ల కవిత

హైదరాబాద్: తెలంగాణ జాగృతి సంస్థ ఇకపై ఎన్జీవోగా పనిచేస్తుందని, తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెన్ జీ యువతే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, ప్రస్తుత ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతూనే తమ పార్టీ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. తెలంగాణ ఉద్యమకారులను గౌరవించుకునే క్రమంలో లక్ష సూపర్ న్యూమరికల్ ఉద్యోగాలను క్రియేట్ చేస్తామని కవిత హామీ ఇచ్చారు. అలాగే 'పాంచజన్యం' పేరుతో ప్రజల్లోకి వెళ్తామని, సర్వోదయ తెలంగాణే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎంతటి పెద్ద జబ్బు చేసినా పేదలకు నాణ్యమైన వైద్యం, విద్యను పూర్తిగా ఉచితంగా అందించడమే తమ విధానమని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల రైతులు ధాన్యం కుప్పలపైనే ప్రాణాలు విడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వస్తే రైతులకు ధాన్యం అమ్ముకునే విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడుతూ.. తెలంగాణ ముఖ్యమంత్రి ఇక్కడ ఉన్నా, ఆయన సిమ్ కార్డు మాత్రం ఢిల్లీలో ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని... మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌లు, ఓవర్ సీస్ స్కాలర్‌షిప్‌ల గురించి సీఎం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సెక్రటేరియట్‌లో దివ్యాంగుల కోసం కనీస సౌకర్యాలు లేకపోవడం ప్రభుత్వ అలసత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. సాధారణ పరిస్థితుల్లో 800 రోజులు, బోనస్ రోజులు కలిపితే మరో 1000 రోజుల్లో ఎన్నికలు రాబోతున్నాయని.. ఈ వెయ్యి రోజులు కాళ్లకు బలపం కట్టుకుని తిరుగుతామని కవిత ప్రకటించారు. కాంగ్రెస్‌ను గద్దె దించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తామని చెప్పారు.

## విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష

మొదటి పేజి తరువాయి



భారీ డేటా సెంటర్లకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. సోలార్ పవర్ పైన స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సోలార్ స్టాల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలని అన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల పక్కనే సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. ?పైలట్ ప్రాజెక్ట్ కింద భూమి అందుబాటులో ఉన్న చోట ఉమ్మడి జిల్లాలో రెండు సబ్ స్టేషన్ల పక్కన ప్రయోగాత్మకంగా సోలార్ పవర్ ప్లాంట్లు నెలకొల్పాలని సూచించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టే 18 సోలార్ పవర్ ప్లాంట్లు (హైదరాబాద్ మినహా ఉమ్మడి తొమ్మిది జిల్లాల్లో జిల్లాకు రెండు చొప్పున) నిర్మాణానికి నోడల్ అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. విద్యుత్ శాఖలో సరఫరా లోపాలు, మెరుగైన విద్యుత్ సరఫరాకు ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాలని చెప్పారు. తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ లో చేరికపై ఉద్యోగులు, సిబ్బందికి ఉన్న అపోహలు తొలగించాలని అధికారులను ఆదేశించారు.

### కిందస్థాయి సిబ్బందితో ఫ్రెండ్లీగా ఉండండి..

## ఆర్టీసీ అధికారులతో పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,: ఆర్టీసీ ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశం నిర్వహించారు. నిన్న(శుక్రవారం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలకు జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశాలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కిందిస్థాయి సిబ్బంది, ప్రయాణికుల విషయంలో ఆర్టీసీ అధికారులు సానుకూలంగా ఉండాలని సూచించారు.సిబ్బందిని వేధింపులకు గురిచేయకుండా ప్రేమతో, సానుకూల దృక్పథంతో పనులు చేయించాలని డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. ఆర్టీసీ అధికారులు కింది స్థాయి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల దురుసుగా కాకుండా ఫ్రెండ్లీగా స్నేహపూర్వకంగా పనులు చేయించుకోవాలని మంత్రి అన్నారు. డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది.. ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. మే 17 లోగా డిపోలు, బస్ స్టేషన్లలో కార్మికులకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని ఆదేశించారు. టాయిలెట్స్, మంచి నీటి సౌకర్యం, ప్లాంటేషన్, పరిశుభ్రత పాటించాలన్నారు. 2023 డిసెంబర్ 9 నుంచి ఆర్టీసీలో మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఖమ్మం, మెదక్, రంగారెడ్డి, నారాయణఖేడ్, బాన్సువాడ, ఇల్లందు లాంటి కొన్ని డిపోలు నష్టాల్లో ఎందుకు నడుస్తున్నాయో ఆర్ఎంలు, డిపో మేనేజర్లు సమీక్షించుకోవాలన్నారు. టికెట్‌కు సంబంధించి ఏదైనా ఇబ్బందులు జరిగితే చర్యలు తీసుకోవాలని.. సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదన్నారు. సంస్థలో ఇంటర్నల్ ఎటాక్ అనేది ప్రమాదకరమైన విషయమని అన్నారు. ప్రతి రెండో మంగళవారం ఆర్టీసీ సిబ్బంది సమస్యలు వినడానికి అన్ని డిపోల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని.. డిపో మేనేజర్లు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్లు.. గ్రామ సర్పంచ్ నుంచి మొదలు ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మంచి ప్రజా సంబంధాలు కొనసాగించాలని సూచించారు. 'ఏదైనా సమస్య మీ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఆర్టీసీ ఎండీ స్థాయిలో పరిష్కారం చేద్దాం. సిబ్బంది పట్ల సానుకూలంగా ఉండాలి. మంత్రి నుంచి సిబ్బంది వరకు అందరం కలిసి పని చేద్దాం. ఆర్టీసీ సమ్మెలో కార్మికులు డిమాండ్ చేసిన సమస్యలను పరిష్కారం చేస్తున్నామని.. భవిష్యత్తులో మంచి ఫలితాలను సాధించే దిశగా ముందుకు వెళ్దామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. జూమ్ సమావేశంలోఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడీలు, ఆర్ఎంలు, వివిధ విభాగాల హెచ్ఓడీలు, డీఎంలు పాల్గొన్నారు.

### ఛత్తీస్‌గఢ్‌లో మందుపాతర తొలగిస్తుండగా పేలుడు..

## ముగ్గురు జవాన్ల మృతి



ఢిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు గతంలో అమర్చిన శక్తిమంతమైన ఐఈడీ (ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్) పేలడంతో ముగ్గురు డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరో జవాను తీవ్రంగా గాయపడ్డాడు. మందుపాతరలు తొలగించే ఆపరేషన్ (డీమైనింగ్) నిర్వహిస్తుండగా శనివారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, కాంకేర్-నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దుల్లో భద్రతా బలగాలు డీమైనింగ్, ఏరియా డామినేషన్ ఆపరేషన్లు చేపట్టాయి. ఇందులో భాగంగా ఛోటే బేతియా పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ బృందం మావోయిస్టులు అమర్చిన బాంబులను గుర్తించి నిర్వీర్యం చేసే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో ఒక ఐఈడీ ఊహించని విధంగా పేలింది. ఈ పేలుడులో ఇన్‌స్పెక్టర్ సుఖ్‌రామ్ వట్టి, కానిస్టేబుల్ కృష్ణ కోమ్రా, కానిస్టేబుల్ సంజయ్ గఢ్‌పాలే అక్కడికక్కడే మృతి చెందారు. మరో కానిస్టేబుల్ పర్మానంద్ కోమ్రా తీవ్రంగా గాయపడగా, అతనికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పట్టిలింగం స్పందించారు. "ఇటీవలి కాలంలో లొంగిపోయిన మావోయిస్టులు, నిఘా వర్గాల సమాచారంతో వందలాది ఐఈడీలను గుర్తించి నిర్వీర్యం చేశాం. కానీ, నేటి దురదృష్టకర ఘటనలో ఓ ఐఈడీని నిర్వీర్యం చేస్తున్న సమయంలో అది పేలింది" అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ల కోసం డీఆర్‌జీ దళాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మార్చి 31న రాష్ట్రాన్ని సాయుధ మావోయిస్టు రహితంగా ప్రకటించిన తర్వాత ఇదే మొదటి పేలుడు కావడం గమనార్హం.

# టీఎంసీకి షాకిచ్చిన బీజేపీ త్రయం

మొదటి పేజి తరువాయి

సంస్థాగత నైపుణ్యాలకు మారుపేరైన బన్సాల్.. భూపేంద్ర యాదవ్, బిప్లబ్ దేబ్ వంటి హేమాహేమీలతో కలిసి తన సైలెంట్ ఆపరేషన్‌తో టీఎంసీ అధినేత్రిని ఉక్కిరిబిక్కిరి చేసిన తీరు చర్చనీయాంశంగా మారింది.

క్షేత్రస్థాయిలో ప్రకంపనలు

'భయం వీడండి, నమ్మకం ఉంచండి' అనే బలమైన నినాదంతో సునీల్ బన్సాల్ బెంగాల్ రణరంగాన్ని సిద్ధం చేశారు. భారీ బహిరంగ సభల కంటే చిన్నపాటి స్ట్రీట్ మీటింగ్స్‌పైనే ఆయన ఎక్కువ దృష్టి పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 53 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకంగా 12,000 వీధి సభలు నిర్వహించారు. అలాగే, ముఖ్యంగా మహిళలు, ఓటర్లతో నేరుగా కనెక్ట్ అయ్యేందుకు లక్షా 65 వేల చిన్న సమావేశాలు ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యేలనే టార్గెట్ చేస్తూ..

ఈ ఎన్నికల్లో బీజేపీ మాస్టర్ ప్లాన్ అందరినీ ఆశ్చర్యపరిచింది. వ్యూహంలో భాగంగా ప్రారంభంలో నేరుగా మమతా బెనర్జీని




లక్ష్యంగా చేసుకోకుండా, టీఎంసీ ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతను వాడుకున్నారు. సుమారు 220 నియోజకవర్గాల్లో టీఎంసీ ఎమ్మెల్యేలపై ఛార్జ్ షీట్లు విడుదల చేస్తూ 80కి పైగా ప్రెస్ మీట్లు పెట్టారు. అమిత్ షా స్వయంగా రంగంలోకి దిగి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ వ్యూహాత్మక దాడితో ఏకంగా 77 మంది అభ్యర్థులను మార్చుకోవాల్సిన ఒత్తిడి టీఎంసీపై పడింది. ఆ తర్వాత మొదలైన 10 వేల కిలోమీటర్ల 'పరివర్తన్ యాత్ర' బీజేపీకి మరింత ఊపునిచ్చింది.

బ్రిగేడ్ సభతో బూస్ట్.. భావోద్వేగాల అస్త్రం

'బ్రిగేడ్ మైదానాన్ని గెలిచిన వారే బెంగాల్‌ను గెలుస్తారు' అన్న వాదనను నిజం చేస్తూ, ప్రధాని మోదీ సభకు 5 లక్షల మందికి పైగా హాజరుకావడం మమత శిబిరంలో గుబులు రేపింది. 'మా-మాటి-మానుష్' పేరుతో జరిగిన అకృత్యాలను గుర్తుచేస్తూ, ఆర్జీ కర్, సందేశ్ ఖాలీ బాధితుల కుటుంబాలకు టిక్కెట్లు ఇవ్వడం ద్వారా బెంగాలీల సెంటిమెంట్‌ను బీజేపీ బలంగా తాకింది. యువత, మహిళల కోసం 'యువ కార్డ్', 'మాతృశక్తి కార్డ్' వంటి పథకాలతో నేరుగా వారిని ఆకర్షించారు. మొత్తంగా 640కి పైగా ర్యాలీలతో సునీల్ బన్సాల్ బృందం బెంగాల్‌ను ముట్టడించి, చరిత్ర సృష్టించే దిశగా బలమైన అడుగులు వేసిందని విశ్లేషకులు అంటున్నారు.

# 44 జాతీయ పక్షులు మృతి.. కర్ణాటకలో హై అలర్ట్

తుమకూరు: కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో జాతీయ పక్షుల వరుస మరణాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. పచ్చని పొలాల్లో కనువిందు చేయాల్సిన అందమైన నెమళ్లు, 'సైలెంట్ కిల్లర్' దాటికి విగతజీవులుగా మారుతున్నాయి. 44 నెమళ్ల మృత్యువాత పడటానికి 'హెచ్5ఎన్1 బర్డ్ ఫ్లూ' మహమ్మారే కారణమని ల్యాబ్ రిపోర్టుల్లో నిర్ధారణ కావడం స్థానికులను, అధికారులను భయాందోళనలకు గురిచేస్తోంది.

పక్షుల మరణాల వెనుక..

ఏప్రిల్ 16న తొలిసారిగా వెలుగుచూసిన ఈ విషాదం, వారం రోజుల్లోనే తీవ్ర స్థాయికి చేరుకుంది. తుమకూరు తాలూకా పరిధిలోని కేసరమడు, హిరేహళ్లి, గులూరు గ్రామ పంచాయతీల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో ఈ పక్షులు మృతిచెంది కనిపించాయి. అటవీ శాఖ అధికారుల గాలింపు చర్యల్లో ఈ దారుణం బయటపడింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు, వాటి నమూనాలను భోపాల్‌లోని



ఐసీఏఆర్-ఎన్ఐహెచ్ఎస్ఏడీ ల్యాబ్‌కు పంపగా.. అత్యంత ప్రమాదకరమైన ఎ5చీ1 బర్డ్ ఫ్లూ వైరస్ వల్లే ఈ నెమళ్లు చనిపోయినట్లు వెల్లడయ్యింది. ల్యాబ్ రిపోర్టుల నిర్ధారణతో అటవీ, ఆరోగ్య, పశుసంవర్ధక శాఖలు యుద్ధప్రాతిపదికన సమన్వయంతో చర్యలు చేపట్టాయి. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు, నెమళ్లు మరణించిన ప్రాంతాల చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిని 'కంటైన్‌మెంట్ జోన్'గా ప్రకటించారు. ఈ పరిధిలో ఉన్న కోళ్ల ఫారాల నిర్వాహకులకు అత్యవసర మార్గదర్శకాలు జారీ చేశారు. అయితే ఏప్రిల్ 23 తర్వాత కొత్తగా ఎలాంటి నెమళ్ల మరణాలు నమోదు కాకపోవడం కాస్త ఊరటనిచ్చే అంశం.

ఆరోగ్య శాఖ అప్రమత్తం

బర్డ్ ఫ్లూ నిర్ధారణ నేపథ్యంలో తుమకూరు జిల్లా అంతటా వైద్యారోగ్య శాఖ హై అలర్ట్ ప్రకటించింది. తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులు, ఫ్లూ వంటి లక్షణాలతో వచ్చే రోగుల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని అన్ని ఆసుపత్రులను ఆదేశించింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పీపీఈ కిట్లు, ట్రిబుల్ లేయర్ మాస్కులు, ఓసెల్టామివిర్ మందుల నిల్వలను తగినంతగా అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

## వరంగల్‌కు మహర్దశ..

### మే 10న కాకతీయ మెగా పార్క్‌ను ప్రారంభించనున్న ప్రధాని



హైదరాబాద్: తెలంగాణలోని వరంగల్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 10వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ ఈ పార్క్‌ను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఇవాళ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. హైదరాబాద్ నుంచి ప్రధాని ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ప్రపంచ స్థాయి సమీకృత టెక్స్‌టైల్ హబ్‌గా ఈ పార్కును తీర్చిదిద్దినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ఈ పార్కు ద్వారా టెక్స్‌టైల్ తయారీ, ఉపాధి, ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ '5యఫ్' (ఫామ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారెన్) దార్శనికతకు అనుగుణంగా టెక్స్‌టైల్ విలువ గొలుసును బలోపేతం చేసేందుకు ఈ పార్కును అభివృద్ధి చేసినట్లు వివరించారు. దాదాపు 1,327 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకున్న ఈ పార్కు దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 1,695.54 కోట్లు కాగా, దీని ద్వారా రూ. 6,000 కోట్లకు పైగా పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రూ. 3,800 కోట్లకు పైగా పెట్టుబడులు ఖరారైనట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. పార్కులోని 62 శాతం స్థలాన్ని యాంకర్ ఇన్వెస్టర్లకు కేటాయించినట్లు తెలిపారు. ఈ మెగా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత 24,400 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని అంచనా. ఇప్పటికే దాదాపు 2,000 ఉద్యోగాలు సృష్టించబడ్డాయని కిషన్ రెడ్డి తెలిపారు. అంతర్గత రోడ్లు, వీధి దీపాలు వంటి పనులు పూర్తయ్యాయని, 232 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, 12 ఎంఎల్‌డి నీటి సరఫరా వ్యవస్థ, వ్యర్థ జల శుద్ధి ప్లాంటు వంటి కీలకమైన మౌలిక సదుపాయాల పనులు చివరి దశలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో పీఎం మిత్ర పార్కులను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. తెలంగాణలోని వరంగల్‌తో పాటు తమిళనాడు, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలలో ఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నారు.

### 180కి పైగా సీట్లు గెలుస్తాం, విజయ్ ముఖ్యమంత్రి అవుతారు



ఢిల్లీ: తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో, విజయ్ నేతృత్వంలోని తమ పార్టీ 234 స్థానాలకు గాను 180 నుంచి 200 నియోజకవర్గాల్లో విజయం సాధిస్తుందని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఎగ్జిక్యూటివ్ చీఫ్ కోఆర్డినేటర్ కేఏ సెంగొట్టయాన్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ పార్టీ కూడా మెజారిటీ సాధించదనే పరిస్థితి ఉండదని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావాల్సిన స్థానాలు తాము తప్పకుండా గెలుస్తామని, విజయ్ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. తమ నాయకుడు విజయ్ దూరదృష్టితో పాలన అందిస్తారని పేర్కొన్నారు. 2026 ఎన్నికల విజయం తమకు చారిత్రాత్మకమైనదని అన్నారు. విజయ్ రాత్రనగ, పగలనక కష్టపడ్డారని, ఎన్నో పరీక్షలను ఎదుర్కొన్నారని, మే 4న వచ్చే ఫలితమే సమాధానం చెబుతుందని అన్నారు. ఎన్నికల అనంతరం పొత్తు వార్తలను ఆయన కొట్టిపారేశారు. తమకు స్పష్టమైన మెజారిటీ వస్తుందని తెలిపారు. కాగా, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్ సర్వేలు తెలిపాయి. అయితే విజయ్ ఈ ఫలితాల అనంతరం కింగ్ మేకర్‌గా నిలుస్తారని టుడేస్ చాణక్య, యాక్సిస్ మై ఇండియా అంచనా వేశాయి. అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చే అవకాశం లేదని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. ఈ నేపథ్యంలో, సెంగొట్టయన్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

### ఈ అద్భుత ఘనకార్యానికి గుర్తుగా దేశంలోని మ్యూజియంలలో

## మోదీ పేరును సువర్ణాక్షరాలతో రాయించాలి: షర్మిల



అమరావతి: వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను భారీగా పెంచడంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కేంద్ర ప్రభుత్వం మరియు ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఓట్ల కోసం వేషాలు కట్టి, ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రజలపై 'బండ బాదుడు' మోపడం మోదీకి అలవాటుగా మారిందని ఆమె ఘాటుగా విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత కేంద్రం ఇచ్చిన అతిపెద్ద గిఫ్ట్ ఈ ధరల పెంపేనని షర్మిల ఎద్దేవా చేశారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి రూ. 993, 5 కిలోల సిలిండర్‌పై రూ. 549 పెంచిన ఘనత మోదీకే దక్కుతుందని ఆమె అన్నారు. కేవలం ఆరు నెలల్లోనే రూ. 1,513 పెంచడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారి అని, ఈ ఏడాదిలోనే ధర 80 శాతం పెరిగిందని ఆరోపించారు. ఈ అద్భుత ఘనకార్యానికి గుర్తుగా దేశంలోని మ్యూజియంలలో మోదీ పేరును సువర్ణాక్షరాలతో రాయించాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ ధరల పెంపు సామాన్యులకు వాతలు పెట్టడమేనని, బయట తినేవారిపై పెనుభారంగా మారుతుందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. టీ స్టాల్స్, చిన్న హోటళ్లు నడుపుకునే వ్యాపారుల జీవితాలను అగమ్యగోచరంగా మార్చారని, విద్యార్థులు, వలస కార్మికుల నడ్డి విరిచారని విమర్శించారు. చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు లాభాలు ఆర్జించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ధరలు పెరిగాయని ప్రజలపై భారం వేయడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. పెంచిన ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు షర్మిల స్పష్టం చేశారు.

## ఉత్తమ్ కుమార్ రెడ్డి కేసీఆర్ కోవర్ట్: ధర్మపురి అర్వింద్

హైదరాబాద్: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కాంగ్రెస్ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గ్యాస్ ధరల పెరుగుదలపై రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలను 'పిల్ల చేష్టలు'గా అభివర్ణించారు. కనీసం దుస్తులు, చెప్పులు కూడా సరిగా వేసుకోవడం తెలియని వ్యక్తి దేశంలో ప్రధాన విపక్ష నేతగా ఉండటం సిగ్గుచేటంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవి చేపట్టిన తర్వాత ప్రజాక్షేమం కంటే తన కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకోవడంపైనే ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారని అర్వింద్ ఆరోపించారు. రేవంత్ పాలనలో రాష్ట్రానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని ఆయన విమర్శించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు 'కోవర్ట్' అని సంబోధిస్తూ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని శాఖల కంటే సివిల్ సప్లై శాఖలోనే భారీగా అవినీతి జరుగుతోందని అన్నారు. ఇరిగేషన్ శాఖలో కూడా కేసీఆర్ మనుషులనే ఉద్యోగులుగా కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కంటే ఉత్తమ్ శాఖలో జరుగుతున్న అవినీతి పెద్దదని ఆయన వ్యాఖ్యానించారు. కాళేశ్వరం అక్రమాల విషయంలో కేసీఆర్ కుటుంబాన్ని రక్షించేందుకు రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.

### మాజీ స్పీకర్ కోడెల జయంతి.. నివాళులర్పించిన చంద్రబాబు!




అమరావతి: ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభాపతి, దివంగత నేత డాక్టర్ కోడెల శివప్రసాదరావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోడెల సేవలను స్మరించుకుంటూ సీఎం ఎక్స్ వేదికగా భావోద్వేగపూరిత పోస్ట్ చేశారు. వృత్తిరీత్యా వైద్యుడైన కోడెల, పేద ప్రజల పట్ల ఎంతో కనికరం చూపిస్తూ 'రూపాయి వైద్యుడి'గా సేవలందించి వారి హృదయాల్లో చెరగని ముద్ర వేశారని చంద్రబాబు కొనియాడారు. కేవలం వైద్యుడిగానే కాకుండా, రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేసిన కోడెల... సంఘవిద్రోహ శక్తులు, ఫ్యాక్షనిస్టులకు భయపడకుండా ధైర్యంగా ఎదురొడ్డి నిలిచిన ధీశాలి అని గుర్తు చేసుకున్నారు. పల్నాడు ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన కృషిని, ఆయనకున్న దూరదృష్టిని ప్రశంసిస్తూ... కోడెల శివప్రసాదరావు లాంటి నాయకుడి సేవలు మరువలేనివని సీఎం తన సందేశంలో పేర్కొన్నారు.

# పుట్టపర్తి దశ మార్చనున్న డీఆర్‌డీవో..

# రూ.15,000 కోట్లతో యుద్ధ విమానాల తయారీ కేంద్రం

మొదటి పేజి తరువాయి

శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఏకంగా రూ.15,000 కోట్ల పెట్టుబడితో ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డీఆర్‌డీవో (రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ) ముందుకు వచ్చింది. ఈ నెల 15న సీఎం చంద్రబాబు ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు రాకతో శ్రీసత్యసాయి జిల్లా దేశ రక్షణ రంగ పటంలో కీలక స్థానాన్ని సంపాదించనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) మోడల్ యుద్ధ విమానాలను తయారు చేయనున్నారు. దేశీయంగా, అత్యాధునిక సాంకేతికతతో రూపొందించే ఈ విమానాలను భారత వైమానిక దళం, నౌకాదళం కోసం వినియోగిస్తారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న సుఖోయ్ ఎస్‌యూ-30 యుద్ధ విమానాలకు ప్రత్యామ్నాయంగా వీటిని అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 600 ఎకరాల భూమిని డీఆర్‌డీవోకు కేటాయించింది. భవిష్యత్ అవసరాల కోసం మరో 400 ఎకరాలను కూడా అందుబాటులో ఉంచింది. నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేసి, 2029 నాటికి మొదటి నమూనాను సిద్ధం చేయాలని, 2035 నాటికి పూర్తిస్థాయిలో విమానాల ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



ఏరోస్పేస్ హబ్‌గా శ్రీసత్యసాయి జిల్లా

ఈ ఒక్క ప్రాజెక్టుతోనే కాకుండా శ్రీసత్యసాయి జిల్లా క్రమంగా ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా రూపాంతరం చెందుతోంది. ఇప్పటికే పాలసముద్రం వద్ద రూ.500 కోట్ల పెట్టుబడితో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) వెయ్యి ఎకరాల్లో డిఫెన్స్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తోంది. అలాగే మడకశిరలో కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ రూ.2,500 కోట్ల వ్యయంతో వెయ్యి ఎకరాల్లో డిఫెన్స్ ఎనర్జిటిక్స్ తయారీ కాంప్లెక్స్‌ను నిర్మించనుంది. ఇప్పుడు డీఆర్‌డీవో ప్రాజెక్టు కూడా తోడవడంతో జిల్లా పారిశ్రామిక స్వరూపం పూర్తిగా మారిపోనుంది. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి కేవలం 130 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉండటం పరిశ్రమల ఏర్పాటుకు కలిసివస్తోంది. బెంగళూరు చుట్టుపక్కల రక్షణ రంగ విస్తరణకు అవకాశాలు తగ్గడంతో కంపెనీలన్నీ శ్రీసత్యసాయి జిల్లా వైపు చూస్తున్నాయి. జిల్లాలోని పుట్టపర్తిలో విమానాశ్రయం అందుబాటులో ఉండటం కూడా ఈ ప్రాజెక్టులకు అదనపు బలంగా మారింది. ఈ పరిణామాలతో రానున్న రోజుల్లో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఈ ప్రాంతానికి రావడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అమెరికా-చైనా కయ్యం మనకు లాభమే



అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం మన దేశానికి మేలు చేస్తుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ నెల 10 నుంచి చైనా దిగుమతులపై 35 శాతం సుంకాలు విధిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా ప్రకటించారు. దీంతో అమెరికా మార్కెట్లో చైనా వస్తువులు ప్రియం కానున్నాయి. ఈ లోటును భర్తీ చేసుకునేందుకు అమెరికా కంపెనీలు భారత్‌వైపు చూసే అవకాశం ఉందని భావిస్తున్నాయి. అయితే మన దేశానికి ఈ లాభం ఏ మేరకు ఉంటుందనే విషయం మన ఉత్పత్తి సామర్ధ్యం, పోటీతత్వాలపై ఆధారపడి ఉంటాయని భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ చెప్పారు. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధంతో మన దేశం నుంచి ఆ దేశానికి ఎలక్ట్రిక్ మెషినరీ, వాటి విడి భాగాలు, ఆటోమొబైల్ విడి భాగాలు, మొబైల్, ఫార్మా, రసాయనాలు, బట్టలు, వస్త్రాల ఎగుమతి పుంజుకునే అవకాశం ఉందని సహాయ్ అంచనా వేశారు.

# జీఆర్‌టీ జువెలర్స్.. స్వర్ణ అవతారం





జీఆర్‌టీ జువెలర్స్ తన 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా వినియోగదారులు తమ పాత బంగారు ఆభరణాలను సరికొత్త ఆభరణాలుగా మార్చుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లో 'స్వర్ణ అవతారం', తమిళనాడులో 'తంగ అవతారం' పేరుతో దీన్ని అందుబాటులోకి తెచ్చింది. అంతేకాకుండా వినియోగదారులు తమ పాత బంగారాన్ని మార్పిడి చేసుకున్నప్పుడు గ్రాముకు అదనంగా రూ.75 అందించనున్నట్లు జీఆర్‌టీ జువెలర్స్ వెల్లడించింది. ఈ పరిమిత కాల ఆఫర్ కేవలం బంగారం ఎక్స్ఛేంజీలో మాత్రమే అందుబాటులో ఉండనుంది. బంగారు నాణేలు లేదా కడ్డీల కొనుగోళ్లకు ఈ ఆఫర్ అందుబాటులో ఉండదని జీఆర్‌టీ జువెలర్స్ తెలిపింది.

# దివీస్ లేబొరేటరీస్ లాభం రూ.589 కోట్లు





దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.2,401 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.589 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.358 కోట్లు)తో పోల్చితే లాభం 65 శాతం వృద్ధి చెందింది. కాగా ఈ ఏడాది జనవరి 1 నుంచి కాకినాడ ప్రాజెక్ట్‌లోని యూనిట్ 3 వాణిజ్యపరమైన కార్యకలాపాలు ప్రారంభించిందని తెలిపింది. ప్రాజెక్ట్‌లోని మిగిలిన యూనిట్లు వచ్చే ఆరు నెలల్లో అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తున్నట్లు దివీస్ లేబొరేటరీస్ పేర్కొంది.

# పెరిగిన జీవీకే హొటల్స్ లాభం



డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో తాజ్ జీవీకే హొటల్స్ అండ్ రిసార్ట్స్ స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.33.89 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.24.21 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ రెవెన్యూ కూడా రూ.111.93 కోట్ల నుంచి రూ.128.66 కోట్లకు పెరిగింది. డిమాండ్ కొనసాగటంతో పాటు విస్తరణ కారణంగా ఆదాయం 15 శాతం పెరగటం ఎంతగానో కలిసి వచ్చిందని కంపెనీ పేర్కొంది. కాగా బెంగళూరులోని యెలహంకలో ఏర్పాటు చేస్తున్న హొటల్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని, వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో అందుబాటులోకి రావచ్చని అంచనా వేస్తున్నట్లు జీవీకే హొటల్స్ వెల్లడించింది.

## బుల్ రన్.. భారీ లాభాలతో
## ముగిసిన స్టాక్ మార్కెట్లు.. చాలా రోజుల తర్వాత



ఇండియన్ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఓ దశలో 1450 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ 23,750 మార్కును అందుకుంది. సెన్సెక్స్ ఇంట్రాడేలో దాదాపు 1450 పాయింట్లు లాభపడి 78,658.59 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1397.07 పాయింట్ల లాభంతో 78,583.81 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 378.20 పాయింట్ల లాభంతో 23,739.25 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.07గా కొనసాగుతోంది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.5.5 లక్షల కోట్లు పెరిగి రూ.425 లక్షల కోట్లకు చేరింది. అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ టారిఫ్ వార్ కు కాస్త బ్రేక్ ఇవ్వడంతో మార్కెట్లో ఫుల్ జోష్ వచ్చింది. కెనడా, మెక్సికో దేశాలపై 25 శాతం, చైనాపై 10 శాతం సుంకాలను విధిస్తున్నట్లు ఇటీవల ట్రంప్ ప్రకటించడంతో ట్రేడ్ వార్ మొదలైందనే భయాలతో ప్రపంచ మార్కెట్లు కుప్పకూలాయి. ఆసియా మార్కెట్లతో పాటు ఇండియన్ మార్కెట్లు కూడా దారుణంగా పడిపోయాయి. అయితే తాజాగా ట్రేడ్ వార్ ను 30 రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రపంచ వాణిజ్యంలో తాత్కాలిక ఉపశమనం కలిగినట్లైంది. దీంతో మార్కెట్లు లాభాల బాటపట్టాయి.

# ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేయాలి

## పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలి
## టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి
## క్లస్టర్ ఇంచార్జ్,యూనిట్,బూత్ ఇంచార్జ్ లకు దిశా నిర్దేశం



**హోళగుంద, మే 3, స్ఫూర్తి పత్రిక:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందేలా, ప్రభుత్వం, ప్రజలకు వారిదిగా ఉంటూ హొళగుంద మండలానికి చెందిన కన్వీనర్లు, క్లస్టర్ ఇన్చార్జులు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ ఇన్చార్జులు కో-ఇన్చార్జుల దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. ఆదివారం ఆలూరు నియోజకవర్గం నందు క్లస్టర్ ఇన్చార్జిలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ పార్టీ బలోపేతం, రాబోయే ఎన్నికల వ్యూహాలు, కార్యకర్తల పాత్ర వంటి కీలక అంశాలపై దృష్టి సారించాలన్నారు.ముఖ్యంగా మై టీడీపీ యాప్ వినియోగం, సభ్యత్వ నమోదు, బూత్ స్థాయి పనితీరు మెరుగుదల, ప్రజలతో మరింత సమీపంగా పనిచేయాల్సిన విధానాలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండలానికి సంబంధించిన క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్ లు,తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మన ఆర్థిక పునాదులు మహా స్ట్రాంగ్

## మన ఆర్థిక పునాదులు మహా స్ట్రాంగ్
## పాత పన్ను విధానం ఆగదు
## జీఎస్‌టీ శ్లాబులు, రేట్ల కుదింపుపైనా దృష్టి
## కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్

కొన్ని సమస్యలున్నా భారత ఆర్థిక పునాదులు ఇంకా పటిష్ఠంగానే ఉన్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌పై ఇండియా టుడే-బిజినెస్ టుడే పత్రికలు నిర్వహించిన ఒక సదస్సులో ఆమె ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. సంస్థాగతంగా చూసినా భారత ఆర్థిక వ్యవస్థ ఇంకా అభివృద్ధి బాటలోనే ఉందన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే తమ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో మధ్య తరగతిని మురిపించిందన్న అనుమానాలను సీతారామన్ తోసిపుచ్చారు. పన్ను చెల్లింపుదారులకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్‌కు సంబంధించి కొత్త పన్ను విధానంతో పాటు పాత పన్ను విధానమూ కొనసాగుతుందన్నారు.

**పెట్టుబడులు తగ్గలే**

కేంద్ర బడ్జెట్‌లో మూలధన పెట్టుబడులు తగ్గించారన్న ఆరోపణలను ఆర్థిక మంత్రి తోసిపుచ్చారు. నిజానికి ఈ పెట్టుబడులు సవరించిన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో నమోదైన రూ.10.18 లక్షల కోట్లతో పోలిస్తే రూ.1.03 లక్షల కోట్లు ఎక్కువన్నారు. ప్రస్తుత జీడీపీలో ఇది 4.3 శాతానికి సమానమన్నారు.

**జీఎస్‌టీ రేట్లపైనా త్వరలో నిర్ణయం**




జీఎస్‌టీ శ్లాబులు, రేట్ల హేతుబద్ధీకరణపైనా జీఎస్‌టీ మండలి త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని నిర్మలా సీతారామన్ తెలిపారు. మూడేళ్ల క్రితం ఇందుకోసం ఏర్పాటైన రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన కమిటీ త్వరలోనే తన నివేదిక సమర్పిస్తుందన్నారు. జీఎస్‌టీ శ్లాబులతో పాటు సామాన్య ప్రజలు ఉపయోగించే వస్తువులపై పన్ను రేట్లు తగ్గించాలన్నదే తమ ధ్యేయమన్నారు.

**ఆర్‌బీఐ కూడా కలిసి రావాలి**

ధరల సెగ లేకుండా ద్రవ్యలోటును కట్టడి చేసేందుకు మొన్నటి బడ్జెట్‌లో, కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్ కాంత పాండే చెప్పారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్‌బీఐ కూడా జీడీపీ వృద్ధి రేటుకు సహకరించాలని పరోక్షంగా వడ్డీ రేట్లు తగ్గించాలని కోరారు. శుక్రవారం ప్రకటించే ద్వైమాసిక ద్రవ్య, పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) కీలక రెపో రేటుపైనా నిర్ణయం తీసుకోనుంది. ఈ నేపథ్యంలో పాండే చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# ప్యూన్ నుంచి ఆఫీసర్ జీతాలు ఎలా పెరుగుతాయంటే.. నెలకు లక్షకుపైగా




భారత ప్రధాని నరేంద్ర మోదీ 2025 జనవరిలో 8వ వేతన సంఘం ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఈ వేతన సంఘం ప్రకారం 8వ వేతన సంఘం జనవరి 1, 2026 నుంచి అమలులోకి వస్తుంది. ఈ క్రమంలో దేశంలోని అన్ని ప్రభుత్వ (కేంద్ర) విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలలో భారీ పెరుగుదల ఉండనుంది. ఈ క్రమంలో 8వ వేతన సంఘం ప్రకారం అన్ని ఉద్యోగుల జీతం 2.86 ఫిట్‌మెంట్ ఆధారంగా పెరగనుంది. ఈ మేరకు 8వ వేతన సంఘం అమలు తర్వాత, ప్యూన్ నుంచి సివిల్ సర్వీస్ ఆఫీసర్ వరకు ఉన్న ఉద్యోగుల జీతాలు ఎలా పెరుగుతాయో ఇక్కడ చూద్దాం.

1. స్థాయి 1

ఈ స్థాయిలో ప్యూన్లు, సహాయక సిబ్బంది వంటి ఉద్యోగులు ఉంటారు. ప్రస్తుతం ఈ ఉద్యోగుల ప్రస్తుత మూల జీతం రూ. 18,000. 2.86 ఫిట్‌మెంట్ ప్రకారం, వారి జీతం పెరిగి రూ. 51,480కి చేరుకుంటుంది. అంటే రూ. 33,480 పెరుగుదల ఉంటుంది.

2. స్థాయి 2

ఇక్కడ లోయర్ డివిజన్ క్లర్కులు ఉంటారు. వీరి ప్రస్తుత మూల జీతం రూ. 19,900. 8వ వేతన సంఘం అమలు తర్వాత, వీరి జీతం రూ. 37,014 పెరిగి, రూ. 56,914కి చేరుకుంటుంది.

3. స్థాయి 3

ఈ స్థాయిలో ఉద్యోగులు పోలీసు కానిస్టేబుళ్లు, నైపుణ్య సిబ్బంది ఉంటారు. వీరి ప్రస్తుత మూల వేతనం రూ. 21,700. 8వ వేతన సంఘం అమలుతో వీరి జీతం రూ. 40,362 పెరిగి రూ. 62,062 అవుతుంది.

4. స్థాయి 4

ఈ స్థాయిలో పోలీస్ స్టెనోగ్రాఫర్లు, జూనియర్ క్లర్కులు ఉంటారు. వారి ప్రస్తుత మూల జీతం రూ. 25,500. 8వ వేతన సంఘం అమలు తర్వాత, వారి జీతం రూ. 47,430 పెరిగి రూ. 72,930కి చేరుకుంటుంది.

5. స్థాయి 5

ఇందులో సీనియర్ క్లర్కులు, ఉన్నత స్థాయి సాంకేతిక అధికారులు ఉంటారు. వీరి ప్రస్తుత మూల జీతం రూ. 29,200. 8వ వేతన సంఘం అమలు తర్వాత, వారి జీతం రూ. 54,312 పెరిగి రూ. 83,512కి చేరుతుంది.

6. స్థాయి 6

ఈ స్థాయిలో ఉద్యోగులు ఇన్స్పెక్టర్లు, సబ్-ఇన్స్పెక్టర్లు కలరు. వారి ప్రస్తుత మూల జీతం రూ. 35,400 కాగా, 8వ వేతన సంఘం అమలుతో వీరి జీతం రూ. 65,844 పెరిగి రూ. 1,01,244 అవుతుంది.

7. స్థాయి 7

ఈ స్థాయిలో సూపరింటెండెంట్, సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఉంటారు. వీరి ప్రస్తుత మూల జీతం రూ. 44,900 కాగా, 8వ వేతన సంఘం అమలు తర్వాత, వారి జీతం రూ. 83,514 పెరిగి రూ. 1,28,414కి చేరుకుంటుంది.

8. స్థాయి 8

ఈ స్థాయిలో సెక్షన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్లు ఉంటారు. వీరి ప్రస్తుత మూల జీతం రూ. 47,600 కాగా, 8వ వేతన సంఘం అమలుతో వీరి జీతం రూ. 88,536 పెరిగి రూ. 1,36,136కి చేరుతుంది.

9. స్థాయి 9


ఈ స్థాయిలో డిప్యూటీ సూపరింటెండెంట్, అకౌంట్స్ ఆఫీసర్ ఉంటారు. వారి ప్రస్తుత మూల జీతం రూ. 53,100. 8వ వేతన సంఘం అమలు తర్వాత, జీతం రూ. 98,766 పెరిగి రూ. 1,51,866 అవుతుంది.

10. స్థాయి 10

ఈ స్థాయిలో సివిల్ సర్వీస్ అధికారులు, గ్రూప్ ఏ అధికారులు ఉంటారు. వారి ప్రస్తుత మూల జీతం రూ. 56,100. 8వ వేతన సంఘం అమలుతో వీరి జీతం రూ. 1,04,346 పెరిగి రూ. 1,60,446కి చేరుకుంటుంది.

# జియోలో రూ.198 రీఛార్జ్ ప్లాన్ గురించి మీకు తెలుసా? రోజూ 5జీ డేటా

సరసమైన డేటా, కాలింగ్ కోరుకునే వినియోగదారుల కోసం రిలయన్స్ జియో బడ్జెట్-ఫ్రెండ్లీ ప్రీపెయిడ్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. మీరు ప్రతిరోజూ 2%+దీ% డేటాను అందించే సరసమైన ప్లాన్ కోసం చూస్తున్నట్లయితే, ఇది మీకు సరైన ఎంపిక కావచ్చు. జియో ఈ ఆఫర్‌లో మీరు రూ. 200 కంటే తక్కువ ధరకే అపరిమిత 5%+% డేటా, ప్రతిరోజూ 2%+దీ% డేటాను పొందుతారు. ఇది ఏ వినియోగదారునికైనా అత్యంత సరసమైన ప్లాన్. మీరు ఇప్పటికే జియో యూజర్ అయితే, ఈ ఆఫర్ మీకు ఖచ్చితంగా నచ్చుతుంది. ఎందుకంటే ఇది ఇప్పటివరకు లభించిన అత్యంత సరసమైన ప్లాన్.




ఇంటర్నెట్‌ను ఎక్కువగా ఉపయోగించే వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్లాన్‌ను తీసుకువచ్చారు. ఈ ప్లాన్ రూ.198. దీనిలో మీరు ప్రతిరోజూ 2 డేటా డేటాను పొందుతారు. ఈ ప్లాన్‌లో ఇంకా ఏ ఇతర ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయో చూద్దాం.

**జియో రూ.198 ప్రీపెయిడ్ ప్లాన్:** తక్కువ సమయంలో ఎక్కువ డేటాను ఉపయోగించాల్సిన వినియోగదారులకు ఈ ప్లాన్ సరైనది. రూ.198 ప్లాన్ ఈ కింద ప్రయోజనాలను అందిస్తుంది. అపరిమిత కాలింగ్: అన్ని నెట్‌వర్క్‌లలో అంతరాయం లేని వాయిస్ కాల్‌లను ఆస్వాదించండి. రోజువారీ డేటా పరిమితి: రోజుకు 2%+దీ% డేటాను పొందండి. ఇది బ్రౌజింగ్, స్ట్రీమింగ్, మరిన్నింటికి చాలా బాగుంది. రోజువారీ ఇందులో ఇబ్బంది లేని కమ్యూనికేషన్ కోసం రోజుకు 100 ఉంటాయి. అదనపు ప్రయోజనాలు: వినోదం, స్టోరేజీ కోసం యాప్‌లకు యాక్సెస్. అపరిమిత 5%+% ప్రయోజనాలు: ఈ ప్లాన్‌లో అపరిమిత 5%+% డేటా ఉంటుంది. ఇది జియో 2%+దీ% రోజువారీ డేటా లేదా అంతకంటే ఎక్కువ ఉన్న ప్లాన్‌లపై మాత్రమే అందిస్తుంది.

**చెల్లుబాటు, ఖర్చు:**

రూ.198 రీఛార్జ్ ప్లాన్
చెల్లుబాటు: 14 రోజులు
మొత్తం డేటా: 28%+దీ
రూ.349 రీఛార్జ్ ప్లాన్:
చెల్లుబాటు: 28 రోజులు
మొత్తం డేటా: 56%+దీ

రూ.198 ప్లాన్ మాదిరిగానే ప్రయోజనాలను అందిస్తుంది. కానీ ఖర్చు ఎక్కువ.

## ఎన్నికల వేళ స్టాక్ మార్కెట్ పతనం..కొద్దిసేపట్లోనే 4 లక్షల కోట్లు ఖతం

దేశీయ స్టాక్ మార్కెట్లోశుక్రవారం (ఏప్రిల్ 19న) షార్ప్ కరెక్షన్ కనిపించింది. మిడిల్ ఈస్ట్‌లో




పెరుగుతున్న ఉద్రిక్తత, దేశంలో లోక్‌సభ ఎన్నికలు సహా పలు అంశాల ఒత్తిడుల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్లు నష్టాల్లో దూసుకెళ్తున్నాయి. ఈ క్రమంలో ఉదయం ఒక దశలో సెన్సెక్స్ దాదాపు 600 పాయింట్లు పడిపోయి 72000 దిగువకు చేరగా, నిఫ్టీ కూడా 150 పాయింట్లు పతనమై 21800 స్థాయికి చేరుకుంది. దీంతో బ్యాంక్ నిఫ్టీ, నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 250, 705 పాయింట్లు కోల్పోయాయి. ఛానల్ ఫాలో అవ్వండి.ఈ క్రమంలో బజాజ్ ఆటో, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, టెక్ సంస్థల స్టాక్స్ టాప్ 5 నష్టాల్లో ఉండగా, అపోలో హాస్పిటల్, , భారతి ఎయిర్‌టెల్, బ్యాంక్ కంపెనీల స్టాక్స్ టాప్ 5 లాభాల్లో ఉన్నాయి. ఐటీ, మెటల్, ఆటో, పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లలో మార్కెట్‌లో గరిష్ట అమ్మకాలు నమోదవుతున్నాయి. ఫలితాల తర్వాత ఇన్ఫోసిస్ షేర్లు దాదాపు 3 శాతం పడిపోయాయి.అంతకుముందు గురువారం సెన్సెక్స్ 454 పాయింట్లు నష్టపోయి 72,488 వద్ద ముగిసింది. ఏప్రిల్ 18న క్రితం సెషన్‌లో నమోదైన రూ. 393.38 లక్షల కోట్లతో పోలిస్తే ఈరోజు ఇన్వెస్టర్లు రూ. 4.18 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో మార్కెట్ విలువ రూ. 389 లక్షల కోట్లకు చేరుకుంది.

# రాణించిన ఇన్ఫోసిస్

### క్యూ4లో రూ.7,969 కోట్ల లాభం.




### రూ.28 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ అంచనాలకుమించి రాణించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో సంస్థ రూ.7,969 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.6,128 కోట్ల లాభంతో పోలిస్తే 30 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 1.3 శాతం ఎగబాకి రూ.37,441 కోట్ల నుంచి రూ.37,923 కోట్లకు చేరుకున్నది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయంలో వృద్ధి 1-3 శాతంగా ఉంటుందని తన గైడెన్స్‌లో పేర్కొంది.2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.1,53,670 కోట్ల ఆదాయంపై రూ.26,233 కోట్ల లాభాన్ని గడించింది. క్రితం ఏడాదిలో ఇది రూ.1,46,767 కోట్ల ఆదాయంపై రూ.24,095 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది.గతేడాది మొత్తానికి ప్రతిషేరుకు రూ.20 తుది డివిడెండ్‌తోపాటు ప్రత్యేక డివిడెండ్ కింద రూ.8 కేటాయించింది.జర్మనీకి చెందిన టెక్నాలజీ సంస్థఇన్-టెక్‌ను కొనుగోలు చేసింది. పూర్తిగా నగదు రూపంలో జరిగిన ఈ ఒప్పందం విలువ 450 మిలియన్ యూరోలు (రూ.4 వేల కోట్లు).కంపెనీ ఉద్యోగులు 7.5 శాతం తగ్గి 3,43,234 నుంచి 3,17,240కి తగ్గారు.గడిచిన ఆర్థిక సంవత్సరంలో 17.7 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నది.ప్రస్తుతం సంస్థ వద్ద 848 మిలియన్ డాలర్ల విలువైన నగదు నిల్వలు ఉన్నాయి. గతేడాది కంటే ఇది 11 శాతం అధికం.'వచ్చే ఆర్థిక సంవత్సరంలో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకునే అవకాశాలున్నాయి. ఇండస్ట్రీస్, ఆర్థిక సే వల విభాగాలకు పెరుగుతున్న డిమాం డే కారణం. తయారీ రంగం గతేడాది కంటే తక్కువ వృద్ధిని నమోదు చేసుకోవచ్చును. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఖర్చులను తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనిస్తాం.

## ఈవీ పాలసీ సమావేశానికి టెస్లా హాజరు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: భారతీయ నూతన విద్యుత్తు ఆధారిత వాహనాల విధానంపై గురువారం జరిగిన భాగస్వాముల సమావేశంలో టెస్లా సలహాదారు పాల్గొన్నారు. దేశంలో అమల్లోకి తేనున్న ఈ కొత్త ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) పాలసీకి సంబంధించి మార్గదర్శకాల కోసం ఆటోమొబైల్ ఇండస్ట్రీ వర్గాల నుంచి కేంద్ర ప్రభుత్వం అభిప్రాయాలను తీసుకుంటున్నది. ఈ క్రమంలోనే ఆయా ఈవీల తయారీ సంస్థలతో సంప్రదింపులు జరుపుతుండగా, టెస్లా తరఫున ఆ సంస్థ సలహాదారు (ది ఆసియా గ్రూప్) కూడా పాలుపంచుకున్నట్టు ఓ ఉన్నతాధికారి తెలిపారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్.. భారత్‌లో పర్యటిస్తున్న క్రమంలో ఇది ప్రాధాన్యతను సంతరించుకున్నది. కాగా, వియత్నాంకు చెందిన ఎలక్ట్రిక్ వెహికిల్స్ తయారీదారు విన్‌ఫాస్ట్ కూడా ఈ సమావేశానికి హాజరైంది. అలాగే మారుతీ సుజుకీ, హ్యుందా య్, టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, కియా, స్కోడా ఆటో, ఫోక్స్‌వాగన్, రెనాల్ట్, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీ కంపెనీల ప్రతినిధులూ హాజరైనట్టు సంబంధిత వర్గాలు చెప్తున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ.. కొత్త ఈవీ పాలసీ వివరాలను ఆయా సంస్థల ప్రతినిధులకు తెలియపర్చింది. కాగా, ఈ నెల 22తో మొదలయ్యే వారంలో మస్క్, మరికొందరు టెస్లా ఉన్నతాధికారులు భారత్‌కు రానున్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరో అవార్డు




శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 18: శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మరో అవార్డు వరించింది. తాజాగా 'బెస్ట్ ఎయిర్‌పోర్ట్ స్టాఫ్ ఇన్ ఇండియా అండ్ దక్షిణాసియా 2024' అవార్డును అందుకున్నది. జర్మనీకి చెందిన స్కైట్రాక్స్ ప్రతియేటా ఇచ్చే ఈ అవార్డుకు భారత్ నుంచి జీఎమ్మార్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్(జీహెచ్ఐఏఎల్) ఎంపికైంది. ఈ నెల 17న జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరిగిన ప్యాసింజర్ టర్మినల్ ఎక్స్‌పో-2024లో ఈ అవార్డును జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్ సీఈవో ప్రదీప్ పణికర్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అవార్డు రావడంతో బాధ్యత మరింత పెరిగిందని, ముఖ్యంగా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి ఎల్లప్పుడూ కృషి చేయనున్నట్లు ప్రకటించారు. విమానాశ్రయంలో పనిచేసే ఉద్యోగుల పనితీరు, స్నేహ పూర్వక, సమర్థత ఆధారంగా ఈ అవార్డుకు ఎంపికైంది. విమానాలకు సంబంధించిన సమాచారం అందించడంలో సిబ్బం ది చురుగ్గా వ్యవహరించడం, ముఖ్యంగా ఇమ్మిగ్రేషన్, సెక్యూరిటీ స్టాఫ్, షాప్స్, ఫుడ్ అండ్ బేవరేజస్ అవుట్‌లెట్లలో స్టాఫ్ పనితీరు మెరుగ్గావుండటం వల్లనే ఇది సాధ్యమైందని పణికర్ తెలిపారు.ఐదు ఎయిర్‌పోర్ట్‌లకు చోటుటాప్-100 బెస్ట్ విమానాశ్రయాల్లో దేశానికి చెందిన ఐదింటికి చోటు లభించిందని స్కైట్రాక్స్ విడుదల చేసిన జాబితాలో వెల్లడించింది. వీటిలో ఢిల్లీకి చెందిన ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి 36వ స్థానం వరించింది. అలాగే బెంగళూరు ఎయిర్‌పోర్ట్ 69వ స్థానం నుంచి 59వ స్థానానికి మెరుగుపరుచుకున్నది. అలాగే హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం 61వ స్థానంలో నిలిచింది.

# ఇన్ఫీ లాభం రూ.7, 969 కోట్లు




ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరపు నాలుగో త్రైమాసికానికి (క్యూ4) ఇన్ఫోసిస్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 30 శాతం వృద్ధితో రూ.7,969 కోట్లకు చేరుకుంది...ఇన్ఫీ లాభం రూ.7, 969 కోట్లుక్యూ4లో 30 శాతం వృద్ధి నమోదురూ.37,923 కోట్లకు పెరిగిన ఆదాయం2024-25 ఆదాయ వృద్ధి అంచనా 1-3%ఒక్కో షేరుకు మొత్తం రూ.28 డివిడెండ్న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరపు నాలుగో త్రైమాసికానికి (క్యూ4) ఇన్ఫోసిస్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 30 శాతం వృద్ధితో రూ.7,969 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఇదే త్రైమాసికానికి కంపెనీ లాభం రూ.6,128 కోట్లుగా ఉంది. కాగా, 2023-24 క్యూ4లో ఇన్ఫీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 1.3 శాతం పెరిగి రూ.37,923 కోట్లుగా నమోదైంది. 2022-23లో ఇదే కాలానికి రూ.37,441 కోట్ల ఆదాయం గడించింది. కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ క్యూ4లో 20.1 శాతానికి తగ్గగా.. 2023-24 మొత్తానికి 20.7 శాతంగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఇన్ఫీ నికర లాభం 8.9 శాతం వృద్ధితో రూ.26,233 కోట్లకు చేరుకోగా.. ఆదాయం 4.7 శాతం పెరిగి రూ.1,53,670 కోట్లుగా నమోదైంది.

### 7.5 శాతం తగ్గిన ఉద్యోగులు

క్యూ3తో పోలిస్తే క్యూ4లో నికరంగా 5,423 మంది ఉద్యోగులు తగ్గారు. దాంతో 2023-24 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ ఉద్యోగుల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 7.5 శాతం (25,994 మంది) తగ్గి 3,17,240 మందికి పరిమితమైంది. ఇన్ఫోసిస్ వార్షిక ఉద్యోగుల సంఖ్య తగ్గడం గడిచిన 23 ఏళ్లలో ఇదే తొలిసారి. అంతేకాదు, వరుసగా ఐదు త్రైమాసికాలుగా కంపెనీ ఉద్యోగుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. కాగా, క్యూ4లో సంస్థ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 12.6 శాతానికి తగ్గింది.

### 1,770 కోట్ల డాలర్ల భారీ ఆర్డర్లు

క్యూ4లో కంపెనీకి 450 కోట్ల డాలర్ల భారీ కాంట్రాక్టులు దక్కగా.. 2023-24 మొత్తానికి ఈ విలువ ఆల్‌టైం రికార్డు స్థాయి 1,770 కోట్ల డాలర్లకు పెరిగిందని ఇన్ఫోసిస్ వెల్లడించింది. "క్లయింట్లకు తమపైన ఉన్న బలమైన నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తోందని ఇన్ఫీ ఎండీ, సీఈఓ సలీల్ పరేఖ్ అన్నారు.

### డివిడెండ్ బొనాంజా

గత ఆర్థిక సంవత్సరానికి గాను ఇన్ఫీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.20 తుది డివిడెండ్‌తో పాటు రూ.8 ప్రత్యేక డివిడెండ్‌ను సైతం ప్రకటించింది. ఇందుకు అర్హులైన వాటాదారులను మే 1న ఎంపిక చేసి, జూలై 1న చెల్లింపులు జరుపనున్నట్లు కంపెనీ వెల్లడించింది. గతంలో ప్రకటించిన రూ.35.5 డివిడెండ్‌తో కలిపి 2023-24కు గాను కంపెనీ చెల్లించే డివిడెండ్ మొత్తం రూ.63.5కు చేరుకోనుంది.

### ఏడీఆర్‌లు 8 శాతం డౌన్

ఈ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25) ప్రకటించిన ఆదాయ వృద్ధి అంచనా నిరాశాజనకంగా ఉండటంతో న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రీ-మార్కెట్ ట్రేడింగ్‌లో ఇన్ఫోసిస్ అమెరికన్ డిపాజిటరీ రిసీట్స్ (ఏడీఆర్) దాదాపు 8 శాతం వరకు క్షీణించాయి. 2024-25లో స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయ వృద్ధి 1-3 శాతంగా ఉండవచ్చని కంపెనీ అంచనా వేసింది. అయితే, ఈసారి కంపెనీ ఆదాయ వృద్ధిని 2-6 శాతం స్థాయిలో అంచనా వేయవచ్చని భావించిన మార్కెట్ వర్గాలకు నిరాశే ఎదురైంది. గత ఆర్థిక సంవత్సరానికి (2023-24) తొలుత అంచనా వేసిన 4-7 శాతం ఆదాయ వృద్ధితో పోలిస్తే కంపెనీ ఈసారి అంచనాలను చాలా తగ్గించింది. అయితే, 2023-24 ఆదాయ వృద్ధి అంచనాను ప్రతి త్రైమాసికంలోనూ తగ్గిస్తూ వచ్చిన కంపెనీ.. క్యూ3 ఫలితాల ప్రకటన సందర్భంగా 1..5-2 శాతానికి కుదించింది. "2023-24 ఆర్థిక సంవత్సరం ఆదాయ వృద్ధితో పోలిస్తే 2024-25 ఆదాయ వృద్ధి అంచనా అధికమే అయినప్పటికీ వ్యత్యాసం చాలా స్వల్పం. ఇండస్ట్రీల వారీగా చూస్తే, ఆర్థిక సేవల రంగం ముఖచిత్రం ఈ ఆర్థిక సంవత్సరంలో మెరుగ్గా కన్పిస్తోంద"ని ఇన్ఫోసిస్ సీఈఓ పరేఖ్ అన్నారు.

### రూ.4,000 కోట్లకు జర్మన్ కంపెనీ కొనుగోలు

జర్మనీకి చెం దిన ఇన్-టెక్ కంపెనీలో 100 శాతం వాటాను 45 కోట్ల యూరోల (దాదాపు రూ.4,000 కోట్లు)కు కొనుగోలు చేయబోతున్నట్లు ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఈ డీల్ పూర్తిగా నగదు రూపంలో జరగనుంది. ఇన్-టెక్ కంపెనీ ఈ-మొబిలిటీ, కనెక్టెడ్ అండ్ అటానమస్ డ్రైవింగ్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఆఫ్ రోడ్ వెహికిల్స్, రైల్ రోడ్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో ఈ కొనుగోలు ప్రక్రి య పూర్తి కావచ్చని అంచనా. జర్మనీకి చెందిన దిగ్గజ వాహన కంపెనీలతో విస్తృత సంబంధాలు కలిగి ఉన్న ఇన్-టెక్ కొనుగోలు ఇన్ఫోసిసకు ఆటోమోటివ్ రంగంలో భవిష్యత్ తరం టెక్నాలజీ సేవలందించేందుకు దోహదపడనుంది. ఇన్-టెక్‌లో 2,200 మంది పనిచేస్తున్నారు. జర్మనీతో పాటు ఆస్ట్రియా, చైనా, యూకే, చెక్ రిపబ్లిక్, రొమేనియా, స్పెయిన్, ఇండియాలో ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

# 9.30 లక్షల కోట్లు ఫట్ వరుస లాభాలతో రికార్డుల్ని సృష్టించిన దేశీయ స్టాక్ మార్కెట్లు..

ఇప్పుడు వరుస నష్టాలతో అల్లాడిపోతున్నాయి. నాలుగు రోజులుగా సూచీలు పతనం దిశగానే అడుగులు వేస్తుండటంతో లక్షల కోట్ల రూపాయల్లో మదుపరుల సంపద ఆవిరైపోయింది. 9.30 లక్షల కోట్లు ఫట్‌నాలుగు రోజులుగాకరిగిపోతున్న మదుపరుల సంపదవరుస నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లుసెన్సెక్స్ 455, నిఫ్టీ 152 పాయింట్లు పతనం3 నిమిషాల్లోనే 319 పాయింట్లు దిగిన బీఎస్ఈ ప్రధాన సూచీముంబై, ఏప్రిల్ 18: వరుస లాభాలతో రికార్డుల్ని సృష్టించిన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ఇప్పుడు వరుస నష్టాలతో అల్లాడిపోతున్నాయి. నాలుగు రోజులుగా సూచీలు పతనం దిశగానే అడుగులు వేస్తుండటంతో లక్షల కోట్ల రూపాయల్లో మదుపరుల సంపద ఆవిరైపోయింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో నమోదైన సంస్థల మార్కెట్ విలువ గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో రూ.9,30,304.76 కోట్లు హరించుకుపోయింది. అంతకుముందు రూ.400 లక్షల కోట్లకుపైనే ఉండటం గమనార్హం. కానీ ఇప్పుడు రూ.3,92,89,048.31 కోట్లుగానే ఉన్నది. హెవీ వెయిట్ షేర్లతోపాటు మిడ్, స్మాల్‌క్యాప్ సూచీల్లోని షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవుతుండటంతో మార్కెట్లు నిలబడలేకపోతున్నాయి. ఈ క్రమంలోనే ఆయా సంస్థల మార్కెట్ విలువ కూడా అంతకంతకూ దిగజారిపోతున్నది.తీవ్ర ఒడిదొడుకులుమదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపుతుండటంతో సూచీలు వరుస నష్టాలకు లోనవుతున్నాయి. గురువారం బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ 454.69



పాయింట్లు లేదా 0.62 శాతం పడిపోయి 72,488.99 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 1,107.38 పాయింట్లు కోల్పోవడం గమనార్హం. కాగా, మధ్యాహ్నం వేళ ఇన్వెస్టర్లు ఒక్కసారిగా పెట్టుబడుల ఉపసంహరణకు దిగారు. దీంతో కేవలం 3 నిమిషాల్లోనే సెన్సెక్స్ ఏకంగా 319 పాయింట్లు దిగజారింది. 1:31 నిమిషాలకు 73,135.50 వద్ద ఉన్న సెన్సెక్స్.. 1:34 నిమిషాలకు 72,817.03 వద్దకు పడింది. మార్కెట్‌లో నెలకొన్న హెవీ సెల్లింగ్ ప్రెషర్‌కు ఇది అద్దం పడుతున్నది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 152.05 పాయింట్లు లేదా 0.69 శాతం క్షీణించి 22 వేల స్థాయికి దిగువన 21,995.85 వద్ద నిలిచింది. ట్రేడింగ్ సమయంలో గరిష్ఠ స్థాయి 22,326.50, కనిష్ఠ స్థాయి 21,961.70 మధ్య సూచీ ఊగిసలాడటం.. తీవ్ర ఒడిదొడుకులకు నిదర్శనంగా నిలుస్తున్నది.నెస్లే షేర్లు ధమాల్‌నెస్లే షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో చిన్నారుల కోసం నెస్లే అమ్ముతున్న పాల ఉత్పత్తుల్లో చక్కెర స్థాయిలు మోతాదుకు మించి ఉన్నాయన్న వార్తలతో ఒక్కసారిగా అలజడి చెలరేగింది. ఈ నేపథ్యంలోనే ఒక్కరోజే 3 శాతానికిపైగా నెస్లే షేర్ విలువ క్షీణించింది. ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున షేర్లను వదిలించుకునే దిశగా వెళ్లారు. ఫలితంగా సంస్థ మార్కెట్ విలువ రూ.8,137.49 కోట్లు తగ్గి రూ.2,37,447.80 కోట్లకు పరిమితమైంది. బీఎస్ఈలో 3.31 శాతం దిగజారి రూ.2,462.75 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 5.40 శాతం పడిపోవడం గమనార్హం. అటు ఎన్ఎస్ఈలోనూ 2.94 శాతం పతనమై రూ.2,471 వద్ద ఉన్నది. అయితే గత ఐదేండ్లలో తమ బేబీ ఫుడ్ ఉత్పత్తుల్లో యాడెడ్ షుగర్స్‌ను 30 శాతం మేర తగ్గించామని నెస్లే ఇండియా చెప్తున్నది. ఇదిలావుంటే బ్యాంకింగ్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, చమురు-గ్యాస్, ఆటో, రియల్టీ, కమోడిటీస్ షేర్లలో సెల్లింగ్ ప్రెషర్ బాగా కనిపించింది. బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలూ 0.39 శాతం, 0.06 శాతం చొప్పున నష్టపోయాయి.


## స్పీకర్ లు లాంచ్! ప్రత్యేకతలేంటి. ధర వివరాలు

శాంసంగ్ సంస్థ బెంగళూరులో జరిగిన శాంసంగ్ అన్‌బాక్స్ మరియు డిస్కవర్ ఈవెంట్‌లో ఫోటో ఫ్రేమ్ మరియు స్పీకర్ గా వాడటానికి వీలుగా ఉండే కొత్త స్పీకర్‌ను బుధవారం విడుదల చేసింది.ఈ మ్యూజిక్ ఫ్రేమ్‌గా పిలువబడే పరికరంను స్వతంత్ర స్పీకర్‌గా లేదా టీవీ తో కలిపి ఉపయోగించుకోవచ్చు.బెంగళూరులో జరిగిన శాంసంగ్ అన్‌బాక్స్ మరియు డిస్కవర్ ఈవెంట్‌లో ఈ కొత్త స్పీకర్ ను లాంచ్ చేసారు. ఈ మ్యూజిక్ ఫ్రేమ్ ధర రూ. 29,990 గా ఉంది. అయితే ఈ పరికరం యొక్క ఖచ్చితమైన లభ్యతను శాంసంగ్ ఇంకా ప్రకటించలేదు. అయితే, సంస్థ యొక్క మరియు స్మార్ట్ టీవీలను ప్రీ-ఆర్డర్ చేసే వారు ఈ మ్యూజిక్ ఫ్రేమ్‌ను కాంప్లిమెంటరీ యూనిట్‌గా ఉచితంగా పొందవచ్చు.ఈ సంవత్సరం ప్రారంభంలో లాస్ వెగాస్‌లో జరిగిన వార్షిక కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ షోలో ఈ మ్యూజిక్ ఫ్రేమ్ మొదటిసారిగా పరిచయం చేసారు. ఈ పరికరం డిజిటల్ ఆర్ట్ మరియు చిత్రాలను ప్రదర్శించగల స్క్రీన్‌తో కూడిన స్పీకర్ మరియు స్టీరియో ప్రభావాన్ని సృష్టించడానికి బహుళ మ్యూజిక్ ఫ్రేమ్ పరికరాలను జతచేయవచ్చు.ఈ స్పీకర్ లు దాని స్వంత రిమోట్ కంట్రోల్‌తో రానప్పటికీ, వినియోగదారులు మ్యూజిక్ ఫ్రేమ్‌ను నియంత్రించడానికి అదే రిమోట్‌ను కూడా ఉపయోగించవచ్చు.ఇది గది అంతటా ధ్వనిని వ్యాప్తి చేయడానికి మూడు స్పీకర్లు మరియు వేవ్‌గైడ్‌ను కలిగి ఉంది. అదనంగా, %ు%-సింఫనీ టెక్నాలజీ ని కూడా కలిగి ఉంటుంది. ఈ



స్పీకర్‌ను ఎంపిక చేసిన శాంసంగ్ స్మార్ట్ టీవీలతో జత చేయడం ద్వారా రెండు పరికరాల్లో ఆడియోను ఒకే సమయంలో ప్లే చేయడం ద్వారా మ్యూట్ చేయకుండా చేయవచ్చు.ఆప్టిమైజ్ చేయబడిన ఆడియో నాణ్యతను అందించడానికి ఈ స్పీకర్ టెక్నాలజీ ని ఉపయోగించి పరిసరాలను స్కాన్ చేయవచ్చు మరియు కొలవవచ్చు.ఈ చిన్న పరికరం ఆరు స్పీకర్లతో అమర్చబడింది మరియు మరియు డాల్బీ డిజిటల్ ప్లస్ వంటి టెక్నాలజీ లకు అనుకూలంగా ఉంటుంది. ఇది 120వరకు ధ్వనిని ఉత్పత్తి చేయగలదు. బ్లూటూత్ లేదా ని ఉపయోగించి మ్యూజిక్ ఫ్రేమ్‌ను స్మార్ట్‌ఫోన్ లేదా స్మార్ట్ టీవీకి కనెక్ట్ చేయవచ్చు.ఇది ఆప్టికల్-ఇన్ కనెక్టివిటీకి కూడా మద్దతు ఇస్తుంది. ఈ స్పీకర్ గూగుల్ అసిస్టెంట్ మరియు అలెక్సాతో కూడా పనిచేస్తుంది. ఇంకా, కి సపోర్ట్ చేస్తుంది.ఈ మ్యూజిక్ ఫ్రేమ్ స్మార్ట్‌థింగ్స్ డాంగిల్‌తో స్మార్ట్‌థింగ్స్ కు హబ్‌గా కూడా పని చేస్తుంది. ఇది వివిధ శామ్‌సంగ్ స్మార్ట్ హోమ్ పరికరాలను నియంత్రించడానికి మరియు పర్యవేక్షించడానికి వీలు కల్పిస్తుంది.గిజ్‌బాట్ తెలుగు వెబ్‌సైట్ గాడ్జెట్లు సహా ఇతర టెక్ న్యూస్‌కు సంబంధించిన ఆసక్తికరమైన తాజా వార్తలను అందిస్తుంది. వివిధ సోషల్ మీడియాల ద్వారా సరికొత్త వార్తలను ఎప్పటికప్పుడు యూజర్లకు చేరవేస్తుంది. తాజా వార్తల కోసం సోషల్ మీడియా ఖాతాలతో కనెక్ట్ అవ్వండి. మీకు ఏదైనా వార్త నచ్చితే లైక్ చేయండి. కామెంట్ చేయడం మర్చిపోవద్దు.

## ఆంధ్రప్రదేశ్‌లో ఎయిర్‌టెల్ 5విస్తరణ




ఆంధ్రప్రదేశ్‌లో గత ఆరు నెలల్లో 5 వినియోగదారుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఎయిర్‌టెల్ హైలైట్ చేసింది. తన నెట్‌వర్క్ విస్తరణ ప్రణాళిక ద్వారా తన సేవలను మొత్తం రాష్ట్రమంతటా సమర్థవంతంగా విస్తరించిందని, కస్టమర్‌లు 5ని స్వీకరించే ప్రక్రియను సులభతరం చేసిందని కంపెనీ పేర్కొంది. నెట్‌వర్క్ ద్వారా కవర్ చేయబడిన ల్యాండ్‌మార్క్ ప్రదేశాలుఆంధ్రప్రదేశ్ లో ప్రత్యేకించి, అమరావతి స్థూపం, తిరుమల తిరుపతి దేవస్థానం వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు మరియు అరకు లోయ వంటి సుందరమైన పర్యాటక ప్రదేశాలు వంటి ఐకానిక్ నిర్మాణ అద్భుతాలను కవర్ చేస్తూ, ఆంధ్రప్రదేశ్ అంతటా తన 5 విస్తరణను కొనసాగిస్తున్నట్లు ఎయిర్‌టెల్ సూచించింది.ఆంధ్రప్రదేశ్ లో 7.9 మిలియన్ల మంది వినియోగదారుల మైలురాయిపై వ్యాఖ్యానిస్తూ, భారతి ఎయిర్‌టెల్, "ఆంధ్రప్రదేశ్‌లో 5ని విస్తృతంగా స్వీకరించడానికి అవసరమైన నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలను నిర్మించడంలో మేము గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నాము. అపరిమిత 5 సేవల యొక్క శక్తిని ఆస్వాదించడానికి అప్‌గ్రేడ్ చేసిన మా విలువైన వినియోగదారులకు మేము మా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

## స్పామ్ కాల్స్‌కు చెక్ పెట్టేందుకు ట్రూకాలర్ కొత్త టూల్ విడుదల..!




భారత్‌లో ఫోన్ వినియోగదారులు ఎక్కువగా స్పామ్ కాల్స్‌తో ఇబ్బంది పడుతున్నారు. అయితే ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ట్రూకాలర్ సరికొత్త టూల్‌ను లాంచ్ చేసింది.ఈ మేరకు వేదికగా సంస్థ అధికారిక ప్రకటన చేసింది. భారీ స్థాయిలో స్పామ్ కాల్‌ను గుర్తిస్తుందని సంస్థ వెల్లడించింది.ఈ స్పామ్ టూల్ విడుదల సందర్భంగా ట్రూకాలర్ సహ వ్యవస్థాపకుడు అలాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో తమ వినియోగదారుల కోసం దీన్ని రూపొందించినట్లు చెప్పారు. తన వినియోగదారుల రక్షణ కోసం నిర్దేశిత లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. మరింత మెరుగ్గా ఈ కొత్త టూల్ స్పామ్ కాల్స్‌ను నియంత్రిస్తుందని చెప్పారు.దీంతోపాటు ట్రూకాలర్ ఇటీవలే ట్రూకాలర్ ఫర్ వెబ్ సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. యూజర్లు మరింత సౌకర్యవంతంగా ఈ ట్రూకాలర్ సేవలను వినియోగించుకొనేందుకు ఈ సర్వీసులను ప్రారంభించినట్లు సంస్థ తెలిపింది. ప్రస్తుతానికి ఆండ్రాయిడ్ యూజర్లను మాత్రమే ఈ వెబ్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది.అన్ని విండోస్, బ్రౌజర్లలోనూ ట్రూకాలర్ వెబ్ పనిచేస్తుందని సంస్థ వెల్లడించింది. దీని ద్వారా మెసెజ్‌లను పంపడం, రిసీవ్ చేసుకోవచ్చు. అయితే ఇందుకోసం ఫోన్ నంబర్‌ను లింక్ చేయాల్సి ఉంటుంది. ఫోన్ నంబర్‌ను లింక్ చేశాక.. ట్రూకాలర్ వినియోగదారుల బిజినెస్ మెసెజ్‌లు, ఇన్‌స్టంట్ మెసేజ్‌లు, మెసేజ్‌లను చూసేందుకు వీలుంటుంది. దీంతోపాటు 100 వరకు డేటాను బదిలీ చేసుకోవచ్చు.సైబర్ మోసాలు, ఆన్‌లైన్ నేరాలు భారత్‌లో రోజురోజుకు గణనీయంగా పెరుగుతున్నాయి. ఫిబ్రవరిలో 2024 లో టెలికాం రెగ్యులేటరీ ఆథారిటీ ఆఫ్ ఇండియా కేంద్ర ప్రభుత్వానికి కీలక సిఫార్సులు చేసింది. ఎవరు ఫోన్ చేసిన వారి పేరు మొబైల్ డిస్‌ప్లేపైన కనిపించేలా కాలింగ్ నేమ్ ప్రజెంటేషన్ సప్లిమెంటరీ సర్వీసులను అన్ని టెలికాం సంస్థలు తమ వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలని ట్రాయ్ సిఫార్సు చేసింది.ప్రస్తుతం మొబైల్ ఫోన్లలో సేవ్ చేసుకున్న వారి పేర్లు మాత్రమే వారు కాలింగ్ చేసినప్పుడు డిస్‌ప్లే పైన కనిపిస్తున్నాయి. థర్ట్ పార్టీ యాప్‌లు వినియోగిస్తున్నట్లయితే క్లౌడ్ సోర్స్ ఆధారిత వివరాలు కనిపిస్తున్నాయి. టెలికాం నియంత్రణ సంస్థ సిఫార్సులు అమల్లోకి వస్తే ఎవరూ ఫోన్ చేసినా వారి వివరాలు వెల్లడి అవుతాయి. పంచుకోగలరు.

SPHOORTI PATRIKA (Telugu Daily) | PRGI Reg. No. APTEL/26/A0542 | Publisher, Printer & Editor: NarasaNaidu Boya | Printed at: Rajeswari Printers, Kurnool |
Place of Publication: Kurnool, Andhra Pradesh | Cell: 8179446036, 7794947413 | Email: sphoortipatrika@gmail.com | Website: www.sphoortipatrika.com